

## ముంపు బాధితులకు పరామర్శ

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** భారీ వర్షాల నేపథ్యంలో గుడిహత్నూర్ మత్తడివాగు సరిహద్దు ప్రాంతం ఇండ్లల్లో నీళ్లు చేరింది. నిత్యావసర సరుకులు, సామాగ్రి వర్షానికి తడిసి కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. శనివారం ఏఎంసీ మాజీ చైర్ పర్సన్ ఆడే శీల బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకునే విధంగా అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వాగు సరిహద్దులో ఎవరు వెళ్లకూడదని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి వేగంగా ఉందన్నారు. గుడిహత్నూర్ గ్రామానికి కూడా మరికొన్ని ఇల్లు, శాశ్వత రోడ్లు మంజూరయ్యేలా చూస్తే చాలా వరకు గ్రామాల్లో సమస్యలు తీరుతాయన్నారు. ఆమె వెంట కాంగ్రెస్ శ్రేణులు సమీర్, వసీం, రియాజ్, ముఖీద్, ఇర్ఫాన్, భివాజీ, రాజు ఉన్నారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. ప్రతి సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి మండల కేంద్రంలోని రంగనాయక స్వామి ఆలయ సముదాయంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని శ్రీకృష్ణుని వేడుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తంగడపల్లి మహేష్, యాదవ సంఘం నాయకులు ఊషణబోయిన ఎర్రయ్య, ధూపం శ్రీనివాస్, భూస శంకర్, ఉమ్మెరా బాలకృష్ణ, శ్రీకాంత్, లక్ష్మి, గోగునూరి లింగయ్య, సామల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న జయంతిని విజయవంతం చేయండి



**ఉద్యమ కెరటం, తాండూర్:** మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి భూసారం మొండి గౌడ్ ఒక పత్రిక ప్రకటనలో కోరారు. సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, గౌడ బంధువులు, గీత కార్మికులు 11 గంటలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ విషయంపై గ్రీవెన్స్ డేలో గీత కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం, ఏజెన్సీ ప్రాంతంలో గీత కార్మికులకు లైసెన్స్ లేనందున, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం మంచిర్యాల జిల్లాలో ఏర్పాటు చేసేందుకు స్థలం కోసం వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. గౌడ బంధువులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఆత్రం సుగుణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బోరంచు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆత్రం సుగుణ జన్మదిన వేడుకలు వారి క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి హాజరై భారీ కేక్ కట్ చేసి సుగుణకు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మావల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపూరి చంద్రశేఖర్, గుడిహత్నూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్యాల కరుణాకర్, ఆదిలాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెస్టేండ్ సామా రూపేష్ రెడ్డి, సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి, రెండ్ల రాజన్న, రాకేష్ సునీల్, విశాల్, సంతోష్, గోవింద్, సోయం విక్రమ్, దినేష్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపద్బాంధవులు.. ఆ అధికారులు

### ఆరుగురుని రక్షించిన జిల్లా యంత్రాంగం

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, డీడీఆర్ఎఫ్ బృందాలతో కలిసి బాధితులను రక్షించారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కారణంగా గుడిహత్నూర్ మండలం సీతాగొంది గ్రామం జాతీయ రహదారి వద్ద ఓ ఇంట్లో ఉదయం నుంచి గాయక్వాడ్ గణేష్ కుటుంబంలోని సభ్యులు ఆరుగురు చిక్కుకున్నారు. వీరు ఇరువురు ఘటన స్థలానికి చేరుకొని డిడిఆర్ఎఫ్ బృందాలను పిలిచి రెస్క్యూ బృందంచే చిక్కుకున్న బాధితులను సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం వారిని ఆదిలాబాద్ కు సురక్షితంగా తరలించే ఏర్పాటు చేశారు.



# దంచి కొట్టిన వాన

- జనజీవనం అతలాకుతలం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- సహాయక చర్యల్లో జిల్లా అధికార యంత్రాంగం







**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో శనివారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి జిల్లాలో పలుచోట్ల జన జీవనం అతలాకుతలమైంది. వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. జిల్లా అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. గుడిహత్నూర్ మండలంలోని సీతాగొంది గ్రామంలో ఒక ఇంట్లో చుట్టూ పక్కల నీరు చేరడంతో సమాచారం అందుకున్న జిల్లా అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని ర్యాపిడ్ ఫోర్స్ ద్వారా కుటుంబ సభ్యులను కాపాడారు. అదేవిధంగా నేరడిగొండ మండలంలోని కుప్టి వాగు, కుంటాల జలపాతం, బోథ్ మండలంలోని పొచ్చర జలపాతం నిండుకుండల్లా ప్రవహించాయి. ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, కళాశాల ఆవరణలో వరద నీరు చేరిందన్న సమాచారాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలదేవిలు పరిశీలించారు. టీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, పాఠశాల ప్రహరీ గోడ గతంలో కూలిపోవడంతో ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహించడం, ప్రహరీగోడ లేనందున పాఠశాల ఆవరణలోనికి వర్షపు నీరు రావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవలే ప్రహరీగోడ నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వర్షాకాలం పూర్తికాగానే యుద్ధప్రాతిపదికన ప్రహరీగోడను నిర్మించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమాచారం అందించాలని తహశీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు.



## భారీ వర్షం.. ఉప్పొంగిన వాగులు

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపులేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రంలోని తీగల ఒర్రె వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో చేపల వేటకు వెళ్లేవారు, పశువులను తీసుకొని వాగు దాటేవారిని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. శిథిలావస్థలో చేరిన ఇండ్లలో ఉండవద్దని, అత్యవసరం ఉంటే తప్పా ప్రజలు ఎవరు బయటకు వెళ్లొద్దని స్థానిక తహశీల్దార్ రామ్మోహన్ రావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సమస్యాత్మక ప్రాంతాల్లో, లో లెవెల్ వంతెనల వద్ద పోలీసు పికెటింగ్ నిర్వహించడం జరుగుతుందని ఎస్సై సర్తాజ్ పాషా పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కు ఫోన్ చేయాలని సూచించారు.

## చెరువును తలపిస్తున్న ఫారెస్ట్ ఆఫీస్



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం చెరువును తలపిస్తుంది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రేంజ్ కార్యాలయం చుట్టూ నీరు చేరి పూర్తిగా చెరువులా మారింది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రతిసారి వర్షం పడ్డప్పుడు ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో నీరు చేరి నిల్వ ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు కార్యాలయంలోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ, మండలాభివృద్ధి అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## వర్షాలకు కూలిపోయిన ఇల్లు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని హేటిగూడ గ్రామంలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పంబాల సన్నాసి ఇల్లు పూర్తిగా కూలిపోయింది. శనివారం ఉదయం ఇల్లు పొంగుతున్న సమయంలో ఇంట్లో ఉన్న వాళ్ళందరూ బయటికి వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా ఇంట్లో నిల్వ ఉంచుకున్న ధాన్యం మొత్తం తడిసి ముద్దయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. అధికారులు స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

## కల్వర్టులను పరిశీలించిన ఎస్సై



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా వరదలు ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాలను శనివారం తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. అచులాపూర్ గ్రామంలో భావ%శీ%డ్ల పెల్లి నరేష్ ఇంట్లోకి వరద నీరు చేరిన దృశ్యాన్ని చూసి సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందజేయడం జరిగిందన్నారు. అదేవిధంగా భారే పల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయ ప్రహరీ గోడా వరద నీటికి కొంతమేర పాక్షికంగా కూలిపోవడం జరిగిందని తెలిపారు. గజ్జలపల్లి, రేచిని, బారేపల్లి గ్రామాల మధ్య కల్వర్టుల వద్ద భారీ వర్షాలకు అధిక నీటితో పొంగి ప్రవహిస్తున్నాయని, ప్రయాణికులు వరద నీటి ఉధృతం తగ్గిన తర్వాత వెళ్లాలని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 కు, స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం అందిస్తే తాము వెంటనే ఆ ప్రదేశానికి చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజల రక్షణ కోసం రాత్రింబవళ్లు సహాయ సహకారాలను అందించడంలో ముందుంటామని ఎస్సై తెలిపారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
17 ఆగస్టు 2025

# జాగ్రత్తగా ఉండండి

సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల



**ఉద్యమ కెరటం, దహెగాం:** కుమురంభీం ప్రాజెక్టు 5 గేట్లు ఎత్తి వరద నీటిని దిగువన వదలడం జరిగిందని, పెద్దవాగు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల తెలిపారు. దహెగాం మండలంలోని పెసరికుంట గ్రామంలో శనివారం పర్యటించారు. పెద్దవాగులో ఎక్కువ వరద నీరు చేరే గ్రామంలోని 12 ఇండ్ల కుటుంబాలతో మాట్లాడారు. 12 కుటుంబాలకు పునరావాసం బీబ్రా గ్రామంలో స్థలం ఉందని, అక్కడికి వెళ్లాలని సూచించారు. దిలా డగా దహెగాంలో స్థలం ఇప్పించాలని వారు కోరారు. బీబ్రా స్థలం నచ్చకపోతే మాకు పేపర్ రాసి ఇవ్వాలని, వేరే స్థలం కోసం పై అధికారులకు పంపిస్తామని అన్నారు. కుమురంభీం పాజెక్ట్ గేట్లు ఎత్తి దిగువన నీరు వదిలారని జాగ్రత్తగా ఉండాలన్నారు. వారికి పునరావాసం గ్రామంలోని చర్చిలో ఏర్పాటు చేయాలనీ స్థానిక అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్తో పాటు దహెగాం తహశీల్దార్ మునవర్ షరీఫ్, ఎంపిడివో రాజేందర్, నాయబ్ తహశీల్దార్ గణేష్, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ నాగభూషణం, దహెగాం పంచాయతీ కార్యదర్శి ప్రణీత్, పెసరికుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమలత, జూనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్, స్థానిక కారోబార్, కామేటిలు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యాలయ సమస్యను పరిష్కరించాలి

**ఉద్యమ కెరటం, దహెగాం:** దహెగాం మండలంలోని పెసరికుంట గ్రామపంచాయతీకి కార్యాలయం మంజూరైందని, నిర్మించడానికి స్థలం సమస్యగా ఉందని గ్రామస్థులు తహశీల్దార్కు తెలిపారు. రెండు, మూడు రోజులలో కార్యాలయ స్థలం సమస్య పరిష్కరించాలని ఆర్ఐ నాగభూషణం, గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండగా, అందులో అరకొర సౌకర్యాలు ఉన్నాయి. ఆయనతో పాటు ఎంపిడివో రాజేందర్, దహెగాం పంచాయతీ కార్యదర్శి ప్రణీత్, జూనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు కలుగొద్దు

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో కొనసాగుతున్న భారీ వర్షపాతం పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం జిల్లా క్యాంప్ కార్యాలయం నుంచి గూగుల్ మీట్ వేదికగా జిల్లా స్థాయి, మండల అధికారులు, తహశీల్దార్లు, ఇరిగేషన్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేయాలని, అవసరమైన చోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. వర్షానికి ఇళ్లలోకి వరద నీరు ప్రవేశించిన గ్రామాలు, కాలనీల్లో వెంటనే నీటిని తొలగించి శానిటేషన్ చర్యలు చేపట్టాలని డీపీవోను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ఫీవర్ సర్వేలు నిర్వహించి తగిన వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యాధికారికి సూచించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, స్వయం సహాయక గ్రూపులు, మెప్మా సహకారంతో రూరల్, అర్బన్ ప్రాంతాల్లో స్నాక్స్, డిన్నర్ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడకూడా సహాయ సహకారాల్లో లోపం లేకుండా చూసుకోవాలన్నారు. వర్షంతో రోడ్లు, వంతెనలు దెబ్బతిన్న చోట్ల వివరాలు సేకరించి తాత్కాలిక మరమ్మత్తులు వెంటనే చేయాలని, శాశ్వత పరిష్కారాల కోసం తగిన ఎస్టిమేట్లు పంపించాలని సూచించారు. నాళాలు, మురుగు కాలువలు శుభ్రపరచడం ద్వారా నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు డ్యామ్లు, చెరువులు, వాగులు వద్ద నీటి మట్టాలను పర్యవేక్షిస్తూ అవసరమైన నివేదికలను సమర్పించాలన్నారు. సాత్నాల, మత్తడి వాగు, కొరాట బ్యారేజీల వద్ద నీటిమట్టం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు కాజ్‌వేలు, వాగులు, నదుల వద్దకు వెళ్లకుండా ఉండేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖలు పరస్పర సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన చోట ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ గూగుల్ మీట్ లో ఐటీడీ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంతో పాటు మండలంలోని కొరటికల్ గ్రామంలో మథుర (క్రైతి లంబాడ) కులస్తులు శ్రీ కృష్ణ జన్మాష్టమిని వేడుకలను శనివారం సంప్రదాయ బద్దంగా ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలంతా కలిసి సాంప్రదాయ పద్ధతిలో మట్టిని తెచ్చి దానితో శ్రీకృష్ణుని ప్రతిమను తయారు చేశారు. అనంతరం సాంప్రదాయ పాటలు పాడుతూ ఆ ప్రతిమను తమ తమ ఇంట్లో ప్రతిష్ఠించారు. భార్య భర్తలు ఇద్దరూ కూడా దినమంతా ఎలాంటి ఆహారం ముట్టకుండా కఠిన నియమాలతో కూడిన ఉపవాసం ఉంటారు. అర్ధరాత్రి శ్రీకృష్ణుడు జన్మించిన సమయం అనంతరం ఆ ప్రతిమకు ఓమా, బంక, బెల్లం, గోధుమ పిండితో తయారు చేసిన నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం గ్రామస్తులను తమ ఇంటికి పిలిచి ఆ తర్వాత తమ ఉపవాసాన్ని విరమిస్తారు.

# డాక్టరేట్ అవార్డు గ్రహీతకు సన్మానం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఇటీవల గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుని శనివారం వివిధ సంఘాల నాయకులు సన్మానించారు. కొమరంభీమ్ జిల్లా జనకాపూర్ ఉన్నత పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వడ్లూరి రాజేష్ కు మేజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ మ్యాజిక్ అండ్ యూనివర్సిటీ ఫరీదాబాద్ హర్యానా వారు గౌరవ డాక్టరేట్ అవార్డును అందజేశారు. హర్యానాలో ఈనెల 2న నిర్వహించిన కార్యక్రమం ద్వారా వడ్లూరి రాజేష్ దీనిని అందుకున్నారు. రాజేష్ పాఠశాల స్థాయిలో ప్రత్యేక బోధనతో చైతన్య పర్చడం, క్షేత్ర పర్యటన ద్వారా కోమరంభీం జిల్లాలో మంచి ఉపాధ్యాయుడిగా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు తీసుకుంటున్న చర్యలతో ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. దీంతో పాటు పాఠశాలకు సమాజానికి అనుసంధానకర్తగా వ్యవహరిస్తూ పాఠశాల అభివృద్ధిలోనూ విద్యార్థులను విద్యా విషయంలో అనేక సృజనాత్మకత చర్యలు తీసుకుంటూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి పనిచేస్తున్నందుకు గాను ఈ అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో పలువురు వివిధ సంఘాల నాయకులు ఎంఆర్పిఎస్ బంబారా, వాంకిడి ఆసిఫాబాద్, నేతకాని సంఘం నాయకులు వీరిని సన్మానించిన వారిలో నారాయణ మాదిగ, పోన్నాల వెంకటి, వడ్లూరి ఎల్లయ్య, ఇగూరపు రాజయ్య, గోడిసేల అశోక్, విట్టు, వడ్లూరి మొండి పోన్నాల రాజేష్, పోన్నాల సోనేరావు పాల్గొన్నారు.



# నెలలో రెండు మెడికల్ బోర్డు నిర్వహించాలి

**ఉద్యమ కెరటం, మందమర్రి:** సింగరేణిలో గతంలో లాగానే నెలలో రెండు పర్యాయాలు మెడికల్ బోర్డు నిర్వహించాలని శనివారం స్థానిక హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గతంలో వారసత్వ ఉద్యోగాలు పొందాలంటే రెండు సంవత్సరాలు ముందుగా విధుల్లో నుంచి వైదొలిగి వారసులకు ఎలాంటి మెడికల్ ప్రక్రియ లేకుండానే కొలువులు ఇచ్చేవారని, కానీ గుర్తింపు ప్రాతినిత్య సంఘాలు ఏర్పాటు అనంతరం మెడికల్ ప్రక్రియ ఆరంభమైందని అసహనం వ్యక్తం చేశారు. సింగరేణిలో 1998 నుంచి 2018 వరకు వారసత్వ ఉద్యోగాలు నిలిపివేశారని, తిరిగి కారుణ్య నియామకం పేరిట 2018 నుంచి ప్రారంభమైన ప్రక్రియ 2024 వరకు సజావుగా జరిగిందని తెలిపారు. కానీ 2025 నుంచి మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్ గతంలో లాగా 95 శాతం చేయాలని, నామమాత్రంగా 5 నుంచి 10 శాతం చేస్తామంటే అది ప్రభుత్వం, సింగరేణి యాజమాన్య వైఫల్యమేనని విమర్శించారు. లంచాలు తీసుకున్నట్టుగా ఆరోపణలు రాగానే విజిలెన్స్ పేరుతో ఆరు నెలలుగా మెడికల్ బోర్డులో ప్రక్రియను నిలుపుదల చేయడం సరికాదని మండిపడ్డారు. లంచాలు తీసుకున్న వారిని ప్రభుత్వం గుర్తించి దోషులను కఠినంగా శిక్షించాలి కానీ మెడికల్ బోర్డు నిర్వహించక జాప్యం చేయడంతో అర్హులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించి మెడికల్ అన్ఫిట్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెల్ది సుదర్శన్, బోనాల శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాసరెడ్డి, చొప్పరి రామస్వామి పాల్గొన్నారు.

# దెబ్బతిన్నరహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలి



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల పనులు నీటి ప్రవాహం తగ్గిన తర్వాత చేపట్టి పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని కోటపల్లి మండలం ఎదులబంధం గ్రామపంచాయతీలో తుంతుంగ వాగు సమీపంలో గల చెరువు పక్కన పాక్షికంగా దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్డును మండల తహశీల్దార్ రాఘవేందర్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. నీళ్లు తగ్గిన తర్వాత పైపులు వేసి తాత్కాలిక మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ మూడు రోజుల పాటు భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులు, ఉధృతంగా ప్రవహించే నదులు, వాగుల వద్దకు ఎవరు వెళ్లకూడదని, పోలీసు శాఖ అధికారులు బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో మాత్రమే ప్రజలు బయటకు రావాలని తెలిపారు. తక్షణ సహాయం, పునరావాస కేంద్రాల సమాచారం, ఇతర వివరాల కోసం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736-250501 నంబర్ ఏర్పాటు చేసి, 24 గంటలు తక్షణ సహాయం సేవలు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. జిల్లాలో వరద, ఘటనల సమాచారం ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ కు అందించాలని పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత దెబ్బతిన్న రోడ్డు ప్రాంతంలో కల్వర్టు మంజూరు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకలు

**ఉద్యమ కెరటం, బోథ్:** సొనాల మండలంలోని సంపత్ నాయక్ తండ గ్రామంలో ప్రజలు తీజ్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక బుట్టల్లో పెంచిన గోధుమ పైరు బుట్టలకు చివరి రోజు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి, పంటలు బాగా పండాలని అందరిని చల్లగా చూడాలని సేవాలాల్ మహరాజ్, జగదాంబ అమ్మవారిని వేడుకున్నారు. ఉపవాసాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులు, యువతీ యువకులు చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ మండల బంజారా లైవ్ అధ్యక్షుడు జాదవ్ కృష్ణ,బీ ఆర్ ఎస్ పార్టీ యువ నాయకులు రాథోడ్ ప్రదీప్, మాజీ సర్పంచ్ రాథోడ్ సకారం, రాథోడ్ దిలీప్, రాథోడ్ గోపాల్ నాయక్, పెద్దలు యువతులు పాల్గొన్నారు.



# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** శ్రీ కృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం అరిగేలా నాగేశ్వర్ రావు నివాసంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ పండుగ దేశ వ్యాప్తంగా జరుపుకునే పవిత్ర పండుగ అని, శ్రీకృష్ణుడు చూపిన బాటలో అందరు నడిచి తమ తమ జీవితాలను ఆనందంగా తీర్చిదిద్దుకోవాలని ఆయన కోరారు. భగవద్గీతను లోకానికి ఉపదేశించి శ్రీకృష్ణుడు జగద్గురువు అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ మండల అధ్యక్షుడు రవి, ఐలవేణి సంతోష్, బోయిని మల్లేష్, బండి శ్రీనివాస్, వెంకటేష్, మేకల భీమేష్, బలరాం నాయక్, మల్లేష్, తిరుపతిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

